క్లుప్తంగా

నేడు పంచముఖి వారాహీ విగ్రహ పునఃప్రతిష్ట

కొల్లిపర: మండల కేంద్రమైన కొల్లిపర గ్రామంలో సోమవారం ఉదయం 8:45 నిమషాలకు శ్రీవారాహీ అనుగ్రహ పీఠంలో వేద మంత్రాల నడుమ శ్రీపంచముఖి వారాహీ విగ్రహ పునః ప్రతిష్ట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో వారాహీ అమ్మవారి ఉపాసన పుష్కరకాలం (12 సంవత్సరాలు) పూర్తయిన సందర్భంగా అమ్మవారి విగ్రహం ఆలయంలో పండితుల సూచన మేరకు పునఃప్రతిష్ట చేయటం జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజకార్యక్రమాలల్లో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని విజ్ఞప్తి చేశారు.

10న అరుణాచలంకు ప్రత్యేక బస్సు

కొల్లిపర: ఈనెల 12వ తేదీన పౌర్ణమి సందర్బంగా అరుణాచలంలోని శివ పుణ్యక్షేత్రంలో గిరి ప్రదక్షిణ మహోత్సవాలకు వెళ్లే శివభక్తులకు గుంటూరు–2 డిపో నుంచి స్పెషల్ హైటెక్(2+2) పుష్ బ్యాక్ బస్సును ఏర్పాటు చేస్తున్నట్లు గుంటూరు–2 డిపో మేనేజర్ షేక్ అబ్దుల్ సలామ్ ఆదివారం ఒక ప్రకటనలో వివరాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివ భక్తులు అరుణాచలంకు వెళ్లటానికి ఏర్పాటు చేసిన బస్సు ఫిబ్రవరి 10వ తేదీన రాత్రి 9:15కి గుంటూరు బస్టాండ్ నుంచి బయలు దేరి 11న తెల్లవారు జామున శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీ పురం గోల్డెన్ టెంపుల్ ఆయా ఆలయాలను దర్శించుకుని అక్కడ నుంచి బయలు దేరి 12న పౌర్ణమి రోజు ఉదయం 4గంటలకు అరుణాచలం చేరుకుని గిరి ప్రదక్షిణలు ముగించుకుని అరుణాచలేశ్వరుని దర్శించుకొని సాయంత్రం తిరుగు ప్రయాణం చేయనున్నట్లు వివరించారు. ప్రయాణానికి ఒక్కో టికెట్ ధర రూ.2420గా అధికారులు నిర్ణయించినట్లు తెలిపారు. ప్రయాణికులు అదనపు సమాచారం కోసం 7382897459, 7382896403 ఫోన్ నెంబర్లకు కాల్ చేసి సమాచారం పొందవచ్చన్నారు. ఈ అవకాశాన్ని కొల్లిపర, తెనాలి వారితో పాటు జిల్లా లోని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని కోరారు.

గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలు

మంగళగిరి (తాడేపల్లిరూరల్): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. మంగళగిరి నగర పరిధిలోని వీవర్స్ కాలనీలో దామర్ల త్యాగరాజు – కోమల గ్రంథాలయ ప్రధమ వార్షికోత్సవం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీవర్స్ కాలనీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎస్. శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను పుస్తక పఠనం వైపు మళ్లించేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు ప్రతిరోజు గ్రంథాలయాన్ని ఉపయోగించుకోవాలని, ప్రతి ఒక్కరు పుస్తకాన్ని చదివేందుకు రోజులో కొంత సమయాన్ని కేటాయించాలని సూచించారు. ఎస్ఎల్ఎమ్ చైతన్య విద్యా సంస్థల అధ్యక్షుడు శింగె బాలకృష్ణ మాట్లాడుతూ పిల్లలకు ఉపయోగపడే గ్రంథాలయాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాస రచన పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. నిర్వాహకులు గోలిధర్మతేజకు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ వి. శ్రీనివాసరావు, అన్నవరపు ప్రదీప పాల్గొన్నారు.
దించారని తెలిపారు.

మైనర్లకు వాహనాలివ్వొద్దు

మంగళగిరి (తాడేపల్లిరూరల్): తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలను ఇవ్వకూడదని మంగళగిరి పట్టణ ఎస్ఐ హరిబాబు సూచించారు. మంగళగిరి నగర పరిధిలోని ఆయా ప్రాంతాల్లో ఆదివారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ మైనర్లు డ్రైవింగ్ చేయడం అత్యంత ప్రమాదకరమని అన్నారు. సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడుపుతున్న వారికి కౌన్సెలింగ్ నిర్వహించి అపరాధ రుసుం వసూలు చేశామన్నారు. మైనర్లుగా ఉండి రోడ్డు ప్రమాదాలకు గురైతే వారి జీవితం నాశనం అవుతున్న విషయాన్ని పిల్లలకు తల్లిదండ్రులు తెలియజేయాలని, పాఠశాలల కళాశాలల యాజమాన్యాలు సైతం మైనర్ విద్యార్థులకు వాహనాలపై రాకూడదని వివరించాలని అన్నారు.

ధ్యాన పిరమిడ్ ఏర్పాటు చేయాలి

తాడేపల్లిరూరల్: ధ్యానంతోనే ప్రజల్లో మార్పు వస్తుందని, ప్రతి ప్రాంతంలోను ధ్యాన కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపట్టాలని యోగా గురువు బండారు నరసింహ, మంగళగిరి ధ్యాన పిరమిడ్ అధ్యక్షుడు శంకర్ కోరారు. ఆదివారం ఉండవల్లిలో మాంసాహారం వద్దు – శాకాహారం ముద్దు అంటూ ర్యాలీ నిర్వహించి శాకాహారం ఉపయోగాలను వివరించారు. బండారు నరసింహ, శంకర్ మాట్లాడుతూ ఉండవల్లిలో నివాసముంటున్న ముఖ్యమంత్రిని ధ్యాన మందిరానికి రాజధానిలో స్థలం కేటాయించి పిరమిడ్ ఏర్పాటు చేయాలని కోరారు. చాలామంది ఆహార విషయంలో కూడా పాశ్చాత్య పోకడలకు పోయి బర్గర్లు, పీజాలు, ఇతర జంక్ ఫుడ్‌లను తమ పిల్లలకు అందిస్తున్నారని, అవి విషపదార్థాలని వారికి అర్థం కావడం లేదన్నారు. పిరమిడ్ సభ్యులు సాయిరామ్, ఝాన్సీ, రామారావు, గాయత్రి, సందీప్ పాల్గొన్నారు.

షూటింగ్ బాల్‌లో మెరుపులు

- షూటింగ్‌బాల్ క్రీడలో రాణిస్తున్న సాయి ఏకనాథ్
- జాతీయపోటీల్లో రాష్ట్ర సభ్యుడిగా హాజరు
- తెనాలిలో 12వ తరగతి చదువుతున్న సాయి



రాష్ట్రజట్టులో సభ్యుడిగా సాయి ఏకనాథ్

తెనాలి: చదువుతోపాటు ఏదొక క్రీడ/కళలో ప్రవేశం ఉండాలనేది నేటి పెద్దలు సలహానిస్తుంటారు. నేటి కార్పొరేట్ సంస్కృతి విద్యావిధానంలో ఆచరించే విద్యార్థులు అరుదుగా ఉంటారు. అకడమిక్ విద్యను శ్రద్ధగా చదువుతూనే తమకు ఆసక్తి, అభిరుచి కలిగిన కళ, క్రీడాంశాల్లో సాధన చేస్తారు. చెప్పుకోదగిన విజయాలను సాధిస్తుంటారు. అలాంటివారిలో షూటింగ్‌బాల్ క్రీడలో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్న తూములూరు సాయిఏకనాథ్ ఒకరు.

కఠోర సాధనతో రాష్ట్ర జట్టుకు ఎంపిక..
తెనాలికి చెందిన సాయిఏకనాథ్ 12వ తరగతి చదువుతున్నాడు. చిత్తూరులోని బీవీ రెడ్డి స్కూలు ప్రిన్సిపాల్‌గా చేసిన తండ్రి టీవీ సుబ్రహ్మణ్యం కారణంగా సాయిఏకనాథ్, పదో తరగతి వరకు అక్కడే చదివాడు. గతేడాది తెనాలిలోని వెస్ట్‌బెర్రీ స్కూలుకు ప్రిన్సిపాల్‌గా తండ్రి బాధ్యతలు చేపట్టటంతో కొడుకు కూడా స్వస్థలమైన తెనాలికి మారాడు. తల్లి దివ్యవాణిశ్రీ గృహిణి. ప్రస్తుతం 12వ తరగతిలో ఉన్న సాయిఏకనాథ్ ఏడాదిగా తనకు ఆసక్తి కలిగిన షూటింగ్‌బాల్ క్రీడలో సాధన చేస్తూ వచ్చాడు. అతడిలోని ఆసక్తిని గమనించిన స్కూల్ పీఈటీ సుబ్రహ్మణ్యం శిక్షణనిచ్చారు. శిక్షకుడి అంచనాకు తగినట్టుగానే ఈ క్రమంలో 2024లో అక్టోబరులో కర్నూలులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఆడాడు. ఆ పోటీల్లో ప్రతిభను ప్రదర్శించిన క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపికచేశారు. ఆవిధంగా ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపికయ్యాడు సాయిఏకనాథ్.


తూములూరు సాయి ఏకనాథ్

జాతీయ జట్టులో స్థానమే లక్ష్యం..
ఆలిండియా షూటింగ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత డిసెంబరు 27–29 తేదీల్లో కోల్‌కతాలోని హౌరాలో జరిగిన జాతీయ పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపికైన పదకొండు మందిలో సాయిఏకనాథ్ ఒకడు. గుంటూరు జిల్లా నుంచి రాష్ట్ర జట్టుకు ఎంపికైన ఏకైక క్రీడాకారుడు కూడా. మన రాష్ట్రంలో పెద్దగా ప్రాచుర్యం లేని షూటింగ్‌బాల్ క్రీడలో ఆంధ్రప్రదేశ్ జట్టు పూల్ గేమ్‌లో రెండు మ్యాచ్‌లను గెలిచింది. తర్వాతి మ్యాచ్‌లో ఓటమి తప్పలేదు. నిరాశ చెందకుండా మరో జాతీయ పోటీలకు క్రమం తప్పకుండా సాధన చేస్తున్నాడు. స్కూలు తరగతులు అయిపోగానే రోజూ సాయంత్రం క్రీడాసాధనకు రెండు గంటలు కేటాయిస్తున్నట్టు చెప్పారు. జాతీయ పోటీల్లో పాల్గొంటూ ప్రతిభతో ఇండియా జట్టు తరపున అంతర్జాతీయ పోటీలకు ఆడాలనేది తన ఆకాంక్షగా సాయిఏకనాథ్ వెల్లడించాడు.

క్షతగాత్రులను ఆదుకోవడం అందరి బాధ్యత


తెనాలి ప్రభుత్వ వైద్యశాలలో వైద్యులు, సిబ్బందితో కలసి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రవాణా అధికారులు

తెనాలిరూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిని వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని తెనాలి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ తోట రాఘవరావు అన్నారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన గుడ్ సమారిటన్ వాల్ పోస్టర్లను తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాల, పట్టణంలోని ప్రైవేటు వైద్యశాలల్లో తెనాలి రవాణా శాఖ అధికారులు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంవీఐ రాఘవరావు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి త్వరితగతిన వైద్య సహాయం అందించి ప్రాణాలు కాపాడాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు. గాయాలపాలైన వారికి సహాయం అందించే వారిని ఉద్దేశించి గుడ్ సమారిటన్ వాల్ పోస్టర్లను రవాణా శాఖ రూపొందించిందని తెలిపారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడినవారిని త్వరితగతిన వైద్యశాలకు తరలించిన వారికి రూ. 5 వేలు నగదు ఇస్తారని చెప్పారు. క్షతగాత్రులను వైద్యశాలకు తీసుకువచ్చిన వారిని ఫారాలు నింపాలని, వైద్య ఖర్చులు చెల్లించాలని ఒత్తిడి చేయకూడదని, వారు వైద్యశాల నుంచి వెంటనే వెళ్లేందుకు అభ్యంతరం చెప్పకూడదని స్పష్టం చేశారు. బాధితులను ఆదుకున్న వారిని సాక్షులుగా ఉండాలని పోలీసులూ ఒత్తిడి చేసేందుకు వీలు లేదని, అవసరమైతే సాక్షిగా ఉండేందుకు అంగీకరిస్తారా అని వారిని అడిగి వారి సమ్మతంతోనే సాక్షిగా పోలీసులు చేరుస్తారని తెలిపారు. ప్రమాద బాధితులను గోల్డెన్ అవర్‌లోపు వైద్యశాలలకు తరలిస్తే ప్రాణాన్ని కాపాడే వీలుంటుందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఏడాదికి 10 మంది గుడ్ సమారిటన్‌లను ఎంపిక చేసి ట్రోఫీ, సర్టిఫికెట్‌తో పాటు రూ. లక్ష నగదు ప్రోత్సాహంగా అందిస్తుందని ఎంవీఐ రాఘవరావు తెలిపారు. ఆయన వెంట అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు మధుసూదనరావు, జి.అమృతరాణి సిబ్బంది ఉన్నారు.

లక్ష డప్పులు..వేల గొంతులు పోస్టర్ ఆవిష్కరణ



తెనాలిరూరల్: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కోరుతూ ఈ నెల 7న హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ సారధ్యంలో నిర్వహిస్తున్న 'లక్ష డప్పులు.. వేయి గొంతులు' కార్యక్రమం పోస్టర్‌ను ఎమ్మార్పీఎస్ నాయకులు ఆవిష్కరించారు. రూరల్ గ్రామం కొలకలూరు బాబు జగ్జీవన్‌రామ్ రీడింగ్ రూమ్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆలపాటి కరుణ, ఎస్.మురళీధర్, కె.నాగేశ్వరరావు, కె.కిషోర్, కె.నాగరాజు, కొలకలూరు పాపారావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్యశిబిరం



తెనాలి: పట్టణానికి చెందిన బెస్ట్ డెంటల్ అండ్ ఇంప్లాంట్ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక మారీసుపేటలోని అప్పలస్వామి ఆలయం వద్ద ఉచిత దంత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. త్రీటౌన్ సీఐ ఎస్.రమేష్‌బాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. దంత వైద్యనిపుణురాలు డాక్టర్ హిమబిందు ఓగిరాల దంత పరీక్షలు చేసి, అవసరమైనవారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ప్రతివారం నిర్వహిస్తున్న ఉచిత దంత వైద్యశిబిరాన్ని అవసరమైనవారు సద్వినియోగం చేసుకోవాలని రమేష్‌బాబు సూచించారు. దంత సమస్యలపై అవగాహన కల్పిస్తూ సమస్యలు ఉన్నవారికి తగిన సూచనలు, సలహాలనిస్తూ కావాల్సినవారికి ఉచితంగా మందులను కూడా ఇస్తున్నామని తెలిపారు.

దత్తాత్రేయుడికి విశేష పూజలు

ఫిరంగిపురం: అమీనాబాద్ గ్రామంలోని దత్త పీఠం వార్షికోత్సవం సందర్భంగా దత్తాత్రేయ స్వామికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం భక్తులు స్వామివారి చిత్ర పటంతో నగర సంకీర్తన చేశారు. పీఠం వద్ద వేద పండితులు విశేష పూజలు నిర్వహించారు. మహారుద్రాభిషేకం చేశారు. కార్యక్రమాలను జయశంకర్ పర్యవేక్షించారు.

చదువులమ్మ చెట్టు నీడలో..


రజతోత్సవ ఆత్మీయ సమ్మేళనంలో నాటి విద్యార్థులు

పూర్వ విద్యార్థుల రజతోత్సవ సమ్మేళనం

తెనాలి: 'హలో నువ్వు...కవితవే కదూ...అవును కదా... బాగానే గుర్తుపట్టాను...' అంటూ ఓ నేస్తం సంభ్రమాశ్చర్యం! 'అరేయ్ సుధాకర్ నువ్వు బాగా మారిపోయావురా...' అంటూ క్లాంత చేసుకుని మరో స్నేహితుడి కామెంట్. 'వెంకట్ కనీసం అప్పుడప్పుడైనా పలకరించొచ్చు కదరా...' అంటూ ఇంకొకరి నిష్ఠూరం...! ఒకనాటి నేస్తాల కుశల ప్రశ్నల సందడి ఇది. ప్రశాంత వాతావరణంలో ఊరికి దూరంగా నారాకోడూరు రోడ్డులోని సుల్తానాబాద్‌లో గల హోటల్ స్వర్ణ ఇన్ ఆదివారం మాత్రం చక్కగా ముస్తాబై వచ్చిన స్నేహితులతో రంగుల సీతాకోకచిలుకలా కనిపించింది. నవ్వులు, కేరింతలతో తుళ్లిపడింది. స్థానిక మారీసుపేటలోని నల్లమోతు చెంచు రామానాయుడు మున్సిపల్ హైస్కూలులో 1999–2000 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులే ఈ సందడికి కారణం. పదో తరగతి చదివి పాతికేళ్లయిన సందర్భంగా రీయూనియన్–రజతోత్సవ వేడుకలను అట్టహాసంగా జరుపుకొన్నారు. అనుకున్న సమయానికి అంతా వచ్చారు. ఒకరినొకరు గుర్తుపట్టి, కుశల ప్రశ్నలు వేసుకున్నారు. కొందరైతే పట్టరాని సంతోషంతో ఉద్విగ్నతకు లోనయ్యారు. గుండె తడితో కళ్లు చెమ్మగిల్లిన అనుభూతిని పొందారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తోటివారిని పలకరించారు. వారు చేస్తున్న వృత్తి/ఉద్యోగం, కుటుంబం వివరాలను తెలుసుకున్నారు. చిరునామాలు, సెల్‌నంబర్లను మార్చుకున్నారు. తమకు పాఠాలు బోధించిన నాటి ఉపాధ్యాయులనూ ఆహ్వానించుకుని, వారిని సత్కరించుకుని కృతజ్ఞతలు చెప్పుకొన్నారు. విందుభోజనం చేసి, ఆటపాటతో కొంతసేపు గడిపారు. చివరగా గ్రూప్ ఫొటో తీసుకున్నారు. మరోసారి కలుద్దామంటూ వీడ్కోలు తీసుకున్నారు. మధురమైన జ్ఞాపకాలను మదినిండుగా నింపుకొని తిరుగుపయనమయ్యారు. రఘురామిరెడ్డి, రాకేష్, ప్రవీణ, వరలక్ష్మి, కేశవ తదితరులు పర్యవేక్షించారు.

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



మంగళగిరి (తాడేపల్లిరూరల్) : వసంత పంచమి, మాఘ మాసం పురస్కరించుకుని మంగళగిరి, తాడేపల్లి పరిధిలో ఉన్న ఆలయాలు భక్తులతో ఆదివారం కిటకిటలాడాయి. ఆలయాల్లో అక్షరాభ్యాస కార్యక్రమాలు జరిగాయి. నగర పరిధిలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో భక్తులు ధ్వజ స్తంభం వద్ద దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలో ఉన్న రాజ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఆయా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మాఘ మాసం, వసంత పంచమి కావడంతో భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చారు.

ముగిసిన ఉచిత వైద్య శిబిరం



తాడేపల్లిరూరల్ : తాడేపల్లి రూరల్ పరిధిలోని చిర్రావూరు గ్రామంలో మానవ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీడీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు విచ్చేసి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో ఖర్చుతో కూడుకున్న పరీక్షలు ఉచితంగా అందిస్తున్న మానవ సేవా సంస్థ సేవలు అభినందనీయమన్నారు. సంస్థ అధ్యక్షుడు వంగర సురేష్ మాట్లాడుతూ సుమారు 1,300 మందికి ఉచితంగా పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశామని తెలిపారు. ఈ శిబిరంలో వైద్యులు నిఖిల్, శశిధర్, అర్చన మాధురి, రాజశేఖర్, వంశీ, శ్రీకర్, కడియాల జయకృష్ణ, జాస్తి ప్రత్యక్ష, వినోద్, శ్రావణి తదితరులు తమ వైద్యసేవలను అందించారు.

కరుణించు.. నిత్య సహాయమాత!

- ఘనంగా నిత్య సహాయమాత వార్షిక పూజా ఉత్సవం
- పట్టణ, పరిసర గ్రామాల్నుంచి తరలివచ్చిన భక్తులు
- రోజంతా జరిగిన ప్రార్థనలు


ప్రత్యేక పూజల్లో ఫాదర్ ఎడ్వర్డ్ డేవిడ్‌రాజు

తెనాలి: పట్టణ చెంచుపేటలోని నిత్యసహాయ మాత దేవాలయం (ఆర్‌సీఎం చర్చి)లో ఏటా ఫిబ్రవరి 2న జరిగే పూజాఉత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. రోజంతా జరిగిన వేడుకల్లో పట్టణ, పరిసర గ్రామాలనుంచి భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. వేడుకలకు దేవాలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. ఉదయం 8.30 గంటలకు మునగాలపల్లి రక్షక సభ గురుశ్రీ డి.రవితేజ నిర్వహణలో సమష్టి దివ్యబలిపూజను నిర్వహించారు. గురుశ్రీ బి.శౌరయ్య ప్రసంగం అనంతరం నిత్యసహాయమాత స్వరూపంతో ప్రదక్షిణ చేశారు. సాయంత్రం బెంగళూరు ప్రావిన్స్‌కు చెందిన ప్రావిన్షియల్ సుపీరియర్ గురుశ్రీ రెవరెండ్ ఫాదర్ ఎడ్వర్డ్ డేవిడ్‌రాజు నిర్వహణలో సమష్టి దివ్యబలిపూజను చేశారు. ప్రత్యేక పూజలు, సాంస్కృతిక ప్రదర్శనలు రాత్రి పొద్దుపోయేవరకు కొనసాగాయి. కోయ స్లీవ, గురుశ్రీ ఆంథోనీ విన్సెంట్, గురుశ్రీ విజయకుమార్, కన్యా స్త్రీలు, ఉపదేశులు, ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

పతావిష్కరణతో వేడుకలు ప్రారంభం..
వాస్తవానికి నిత్యసహాయ మాత దేవాలయంలో పూజాఉత్సవానికి ముందు తొమ్మిదిరోజులు ప్రతిరోజూ సాయంత్రం జపమాల ప్రార్థన జరిగింది. నిత్యసహాయమాత నవదిన ప్రార్థనలు కొనసాగాయి. దివ్య సత్ప్రసాద ఆశీర్వాదం, దివ్య బలిపూజ, ఆధ్యాత్మిక ప్రసంగాలు జరిగాయి. తొలిరోజైన అంటే గత నెల 24వ తేదీ సాయంత్ర గుంటూరు మేత్రాసనం కోశాధికారి/ఛాన్సలర్ గురుశ్రీ డి.కిరణ్ నిత్యసహాయమాత పతాకావిష్కరణతో వేడుకలు ఆరంభించారు.

కోత పండుగగా సైతం..
ఏటా ఫిబ్రవరి 2న జరిగే నిత్యసహాయమాత పూజాఉత్సవానికో విశేషముంది. బైబిలు ప్రకారం కొత్త పంట రైతుల చేతికొచ్చే శుభతరుణాన్ని పురస్కరించుకుని దైవార్పితం చేయడానికి ఏర్పడిన పండుగ ఇది. దీన్ని కోత పండుగ, ప్రథమ ఫలముల పండుగ అని అంటారు. పండుగ కేవలం పంటకు, వ్యవసాయానికి సంబంధించినది. అందువల్ల పేదలు, అన్నార్తులు, వితంతువులు, ఆధారం లేని పిల్లలకు దానంచేసి ఆదరించే పండుగ ఇది. రిడంప్టరిస్ట్ అనే రక్షక గురువులతో ఏర్పడిన సంస్థ ద్వారా పండుగను నిర్వహిస్తారు. దైవసేవ, సామాజిక సేవతో తెనాలి, పరిసర గ్రామాలకు విస్తరించిన ఈ దేవాలయంలో ఫిబ్రవరి 2న జరిగిన పూజాఉత్సవం ఘనంగా నిర్వహిస్తారు.


విద్యుద్దీపాలంకరణలో నిత్య సహాయమాత ఆలయం

కేంద్ర బడ్జెట్‌పై సీపీఎం నిరసన



నిరసన నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు

తెనాలి: అప్పుల ఊబిలో ఉన్న రాష్ట్రానికి కేంద్ర బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించకపోవటంపై సీపీఎం నాయకులు ఆదివారం నిరసన తెలియజేశారు. స్థానిక మార్కెట్ సెంటర్లోని గాంధీజీ బొమ్మ వద్ద ఆ పార్టీ నాయకులు నిరసన నినాదాలు చేశారు. సీపీఎం తెనాలి కార్యదర్శి కొల్లిపర బాబూప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ఆర్థికమంత్రి పార్లమెంటులో ప్రకటించిన 2025 బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని చెప్పారు. రాష్ట్రవిభజనతో నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు ప్రస్తుత బడ్జెట్‌లోనైనా నిధులు కేటాయించి ఆదుకుంటారని ఎదురుచూసిన వారికి కేంద్రం నిరాశను మిగిల్చిందని చెప్పారు. బడ్జెట్లో విభజన చట్టం ఊసే లేదన్నారు. పారిశ్రామిక కార్మికులకు ప్రస్తుత రూ.1000 పింఛనును రూ.7,500లకు పెంచుతారని ఎదురుచూస్తే ఆశాభంగం కలిగించారని చెప్పారు. ఉపాధిహామీ పథకానికి కూడా ప్రస్తుత ధరలకు అనుగుణంగా నిధుల కేటాయింపు జరగలేదన్నారు. బాధ్యత కలిగిన రాజకీయపార్టీలు బడ్జెట్‌లో రాష్ట్రానికి అవసరమైన నిధులు కేటాయించని కేంద్రాన్ని ప్రశ్నించకపోవటం సరికాదన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో రైతులకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు.. సేంద్రియ వ్యవసాయానికి నిధులు లేకుండా అభివృద్ధి ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. ఎరువుల ధరలకు రెక్కలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. సీఐటీయూ నాయకుడు షేక్ హుస్సేన్‌వలి తన ప్రసంగంలో ప్రజల కొనుగోలు శక్తి పెంచకుండా ఆర్థికాభివృద్ధి జరగదని చెబుతూ బడ్జెట్ అందుకు అనుగుణంగా లేదన్నారు. పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా ఉందన్నారు. నిరసనలో రాజశేఖర్, మాగుంట యలమందయ్య, ఓ.దుర్గాప్రసాద్, కోగంటి భాస్కరచంద్, బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాసుదాసస్వామి జయంతి ఉత్సవాలు ప్రారంభం



తెనాలి: రూరల్ మండల గ్రామం అంగలకుదురులోని శ్రీకోదండరామ సేవక ధర్మసమాజం (దాసకుటి)లో ఆంధ్రవాల్మీకి శ్రీవాసుదాసస్వామి 163వ జయంతి ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడురోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా తొలిరోజున శ్రీవాసుదాస స్వామి జయంతి అయినందున వారి పాదుకలకు అభిషేకం, పూజలు చేశారు. రెండోరోజైన సోమవారం భూదేవి శ్రీదేవి సమేత శ్రీనివాస స్వామి కళ్యాణం, సీతారామకళ్యాణం, శ్రీమహాలక్ష్మి అమ్మవారి సామూహిక కుంకుమపూజ జరుగుతాయని నిర్వాహకులు ఉలిచి సీతారాంశర్మ పట్టాభి తెలియజేశారు. అదేవిధంగా నాలుగో తేదీన శ్రీరమాసహిత సత్యనారాయణస్వామి వ్రతం జరుగుతుందని తెలిపారు. భక్తులు దర్శించుకుని ఆచార్య అనుగ్రహానికి పాత్రులు కావాలని కోరారు. వివరాలకు 9966153156 నెంబరులో సంప్రదించవచ్చని సూచించారు.


బుర్రిపాలెం రోడ్డును కప్పేసిన మంచు


మారీసుపేటలో దట్టంగా పొగమంచు

తెనాలిపై మంచు తెర

తెనాలి పట్టణాన్ని మంచు దుప్పటి కప్పేసింది. సీతాకాలం కొనసాగుతున్నా ఎన్నడూ లేని విధంగా ఆదివారం ఉదయం తెనాలి పట్టణాన్ని మంచు కప్పెసింది. ఉదయం 8.30 గంటల వరకు పొగమంచు దట్టంగా ఉండటంతో రహదారులు కనిపించలేదు. వాహనదారులు లైట్లు వేసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. అలాగే చెట్లపై మంచు తెరలు కనిపించాయి. – తెనాలిఅర్బన్